# అద్దె కొంప

శ్రీమతి వడ్డి కృష్ణవేణి

అప్పుడు నిద్రనుండిలేచి కాలకృత్యాలు తీర్చుకొని కుర్చీలో కూర్చున్నాడు మోహనరావు. కాఫీకప్పు చేతికందించి ప్రక్కనేనిలుచుంది భార్య. "ఏంశ్యామలా! రోజూప్రొద్దున ఎంతోహడావుడిగ ఉండే దానివి - ఇవ్వాళ సావకాశంగ నిల్చున్నావే" అని ప్రశ్నించాడు మోహను.

"మీతో ఒక విషయం చెప్పాలండి" అంటూ జాలిగనిల్చుంది. "శ్రీఘ్రం సెలవివ్వండి; శ్రీమతిగారి కోరికేమిటో" అంటూ వేళాకోళం చేసాడు భర్త. "నాకోరికేమంత ఖరీదైంది కాదులెండి! ఎక్కడైనా ఒక మంచి ఇల్లు చూడండి. ఈ మట్టికొంప అలకలేక చస్తున్నాను. ఎక్కడచూచినా పందికొక్కుకన్నాలే" అని ప్రాథేయ పూర్వకంగ అడిగింది శ్యామల. సరేనన్నాడు భర్త.

శ్యామల కోరికప్రకారం ఒక మంచి ఇల్లు (అంటె గచ్చుదిలెండి) చూచాడు. అద్దెకూడా తక్కువే. చిన్న ఇల్లు అయినా ఎల్లాగో సరిపెట్టుకుందామని మంచి రోజు చూచి ఆ ఇంట్లోకెళ్లా రాదంపతులు. వారికిద్దరు పిల్లలు.

మన ఇంటావిడయిన సుబ్బమ్మగారి మనస్తత్వ మెటువంటిదంటే ప్రతివారు తనకు లోబడి తను చెప్పినట్లు వినాలని, ఎవ్వరూతనకన్నా గొప్పగా వుండకూడదని, తన ఇంట్లో వున్నందుకు తన ఆదేశ ప్రకారం నడుచుకోవాలని తలచేది. మనశ్యామల కటువంటివి గిట్టవు. తనస్థళంలో తన ఇష్టమొచ్చినట్లు నడుచుకోవలెనని భావించేది. రోజులు గడచిన కొద్దీ సుబ్బమ్మగారి దుర్నడతలు శ్యామలకు నచ్చలేదు. సంసారి కుండవల్సిన లక్షణాలేవీ ఆమెలో కనిపించలేదు. అందుచే శ్యామల ముభావంగ వుండటం మొదలెట్టింది.

నిలువెల్ల ఈర్ష్యాసూయలు మూర్తీభవించిన సుబ్బమ్మగారికి శ్యామల ప్రవర్తన భరింపరానిదైపోయింది. "తన కన్నా గౌరవంగా వుంటున్నదే, ఇరుగు పొరుగువారు ఆమెను గౌరవించి మాట్లాడుతారే" అన్నకుళ్లు అధికమైంది. ఎల్లాగైనా శ్యామలను అల్లరిపెట్టి సాధించాలని తలచిందా కుళ్లు హృదయం.

ఒక రోజు ఉదయాన్నే "పాచివాకిలి సరిగతుడవలేదని, పిల్లలు అల్లరిచేస్తున్నారని" ఇంకా ఏమోమో సాధించటం మొదలెట్టింది. అవన్నీ వినీ విననట్టు, తప్పుక తిరుగ సాగింది శ్యామల.

"దుష్టుణ్ణిచూచి దూరంగవుండ" మన్నట్లు శ్యామల ఆమెతో మాట్లాడటం కూడ మానుకుంది. శ్యామలగాని, వారి పిల్లలు గాని కాలు కదిపితే "ఏంతప్పు దొరుకు తుందా" అని కంటిలో వత్తి వేసుకొని వెతుకుతూండేది. "తప్పులెన్ను వారు తండోపతండంబు, లుర్విజనుల కెల్లనుండు తప్పు"లన్నట్లు వెతగ్గా వెతగ్గా ఎక్కడో ఒక తప్పు దొరక్కపోతుందా? అందులో పిల్లలున్న చోట ఏదో ఒక అల్లరి, తప్పు జరుగుతూనే వుంటుంది. వీటినిగురించి పెద్దవాళ్లు అల్లరి పడడం ఏమంత బాగుంటుంది చెప్పండి. పిల్లలుగాక అల్లరి పెద్దవాళ్లు చేస్తారా?

శ్యామలయొక్క శాంత గుణం, సుబ్బమ్మగారి ఆగ్రహాన్ని అధికంచేసింది. ఆ నాటి సాయంకాలం శ్యామలగారి పిల్లలు వారి స్నేహితులు కలసి అరుగుమీద ఆడుకుంటున్నారు. అందరు కలసి వేరుశనక్కాయలుతిని చెక్కులు వాకిట్లో పోశారు. ప్రొద్దుగూకింతరువాత ఎవరిళ్లకు వారు వెళ్లిపోయారు. ఇంక మన సుబ్బమ్మగారి సంతోషానికి మేరలేదు. ఎందుకంటే పిల్లలు పోసిన చెక్కులు నలుగురికి చూపించి శ్యామలను అల్లరిపెట్టాలని చూచింది. తన భర్తకు చెప్పింది- ఆయన భార్య చేతిలో కీలుబొమ్మ. జీవచ్ఛవంలాగ జీవయాత్ర జరుపుచున్న ఒక నిర్భాగ్యుడు. కాకపోతే భార్యను స్వేచ్ఛగామీరబెట్టి ఏమీ ఎరుగనట్లు ఇల్లే వైకుంఠంలాగ వుంటాడా చెప్పండి! ఆ మహానుభావుడు భార్య బోధనలన్ని బురకెక్కింతరువాత ఇల్లెగిరి పోయేట్లు "మనుషులకు ఒకసారి చెప్తె బుద్ధుండాలి, వాకిలంతా ఇల్లా అల్లరిచేస్తారా! ఇదే మన్నా సంసారి కొంప కాదనుకున్నారా! ఇల్లా అవుతె ఇల్లు ఖాళీచేయండి" అని కేకలెయ్యటం మొదలుపెట్టాడు. ఆయన మాటలు విన్న శ్యామలగారబ్బాయి "మేము కుక్కలం పందులంగాదండీ! మనుష్యులమే - మేముకూడా మీకుమల్లె అన్నమే తింటున్నాము. ఇది సంసారి కొంపకాదని ప్రపంచమంతా అనుకుంటూంటె మేం మాత్రం అవుననగలమా! "పదుగురాడుమాట పాటియై ధరజెందు, ఒక్కడాడుమాట నొక్కడెందు" అని వేమనగారు చెప్పినట్లు ప్రజలందరు ఏకగ్రీవంగ ముక్తకంఠంతో కాదని మొరపెడ్తుంటె మేం మాత్రం ఏమనాలి చెప్పండి" అంటూ నవ్వటం మొదలెట్టాడు. ఇక చూడండి ఆభార్యాభర్తలిద్దరు శివమెత్తినట్లు ఆడిపోవడం మొదలెట్టారు. శ్యామలకు ఇదంతా వింటుంటే ఒళ్లు మండిపోయి, కోపము ఆగటంలేదు. ఏంచెయ్యాలో తోచక బాధపడుతున్నది. ఈ కాలపు పిల్లల నోరుకట్టడంఎవరితరం!

అప్పుడె శ్యామల భర్త ఇంటి కొచ్చాడు. శ్యామల జరిగినదంతా చెప్పింది. "పిల్లలన్నాక పొయ్యకుండా వుంటారా! తర్వాత ఊర్కోవాలిగాని, దెబ్బలాడు కోట మెందుకు" అని అన్నాడు. "ఇల్లా అవుతే మాకు కుదరదండీ. మాకు శుభ్ర మెక్కువ. ఇల్లు ఖాళీ చేయండ"ని ఇంటాయన చెప్పాడు. వారి మాటలు విన్న మోహను "వారంరోజుల్లో తప్పక ఖాళీచేస్తాంలెండి" అని చెప్పగానే "మిమ్మల్ని గట్టిగా ఖాళీచెయ్యమని చెప్పామా? ఏదో సర్దుకోపోవాలిగాని" అంటూ తాపీగా మాట్లాడటం మొదలెట్టారు; వారిమాటల్లో ఏదినిజం– ఖాళీ చేయటమా! మానటమా?

కాని, శ్యామల, మోహనులు మాత్రం ఇల్లు ఖాళీ చేయాలని సంకల్పించుకున్నారు. ఎందుకంటె తెల్లవారినదగ్గిర నుంచి పిల్లలకు ఘోషెక్కువైంది. 'నరుల ఘోషకు నల్లరాయి బ్రద్దలవుతుందం'టారు పెద్దలు. అందుచే ఇంటికోసం వెదక నారంభించారు. ఈ విషయం సుబ్బమ్మ గారికి తెలిసింది. ఇల్లు ఖాళీఅయితే అద్దెరాదే, కరెంటు చార్జి తామే కట్టుకోవాలే. ఇంటికి చాకిరీ చెయ్యాలే – అన్న ఆలోచనతో కుమిలిపోయి గుసగుసలాడ నారంభించారు. శ్యామలకు ప్రక్క ఇంటావిడచేత 'ఇల్లు ఖాళీచెయ్యవద్దనీ, మాటకు మాట అనుకుంటె మాత్రం అనుకున్నప్పుడల్లా ఖాళీచేస్తామా! ఒకరితో ఒకరు మాట్లాక పోయినా ఎవరి దారిన వారే వుండవచ్చు. ఒకవేళ సుబ్బమ్మగారేదైనాఅన్నా సరిపెట్టుకొని అల్లాగె వుండండనీ, ఈసారి దెబ్బలాడుకున్నప్పుడు చూడవచ్చునమ్మాయిగారు' అని చెప్పించింది. పెద్దవారి మాటకాదనడ మెందుకని శ్యామల మాట్లాడకుండా వూరుకొంది. సుబ్బమ్మగారు మాత్రం వారంరోజులకొకసారైనా దెబ్బలాడకుండా వుండటంలేదు. దెబ్బలాడినప్పుడల్లా "ఇల్లు ఖాళీచేయమనడం, తప్పకుండా ఖాళీచేస్తాంలెండి" అంటే "గట్టిగా ఖాళీచేయిమన్నామా" అంటూ వుండటం అలవాటైపోయింది. ఈ అద్దెకొంపల్లో ఎన్ని అగుచాట్లు పడుతున్నామో చెప్పతరంకాదు. ప్రభుత్వం వారు రైలు వాళ్లలాగ ఇళ్లుగట్టించి అద్దెకన్నా ఇయ్యకూడదూ! ఈసారి ఇంటివారు ఖాళీ చెయ్యమంటే ఏం సామాధానం చెప్పాలో! ఏంచెయ్యాలో పాఠకులే ఆలోచించి చెప్పండేం!